క్లుప్తంగా

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో బాలకుటీర్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం ప్రకటించిన సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరైన 197 మంది విద్యార్థులందరు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. 485 మార్కులతో రేయాన్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. సబ్జెక్టుల వారీగా ఇంగ్లిష్-97, ద్వితీయ భాష-100, మ్యాథ్స్-100, సైన్స్-97, సోషల్-99 మార్కులను విద్యార్థులు సాధించారని వివరించారు. 25 మందికి పైగా 90 శాతం, 65 మందికి పైగా 80 శాతం మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థుల కృషి, పట్టుదల, నిరంతర శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో విలువలతో కూడిన విద్య నేర్చుకుని, సమాజంలో ఉన్నత పౌరులుగా నిలవాలన్నదే తమ ఆశయమన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను సహకార్యదర్శి జయశ్రీ, సీఏవో రఘురాం గారు, ప్రిన్సిపాల్ సుధా మాధవి అభినందించారు.

సైకిల్ కు ఓటెయ్యనన్నందుకు..

- దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు


గాయపడ్డ చుక్కా ఏసురత్నం

మంగళగిరి: నగర పరిధిలో బేతపూడి శిబిరంలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. స్థానిక ఓటరు చుక్కా ఏసురత్నాన్ని టీడీపీకి ఓటు వేయాలని కోరగా తిరస్కరించారు. వైఎస్సార్ సీపీకి వేస్తానని చెప్పడంతో స్థానిక టీడీపీ కార్యకర్తలు దిడ్ల సత్యానందం, కార్యంశెట్టి రాజు, కార్యంశెట్టి దేవరంలు దాడి చేసి గాయపరచారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పులో పోటెత్తిన ఓటర్లు

- ఉదయం 6.30 గంటలకే బారులు
- రాత్రి వరకు క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లు
- సాయంత్రం 6 గంటల వరకు క్యూలైన్ల ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం
- కొన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పష్టంగా కనిపించిన అధికారుల వైఫల్యం


పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఓటరుల పోటెత్తారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 6.30 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ఓటర్లు క్యూలైనులో నిలబడ్డారు. కొన్ని పోలింగ్ బూతుల్లో మౌలిక వసతులు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.

అధికారుల వైఫల్యం

తూర్పు నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూతుల వద్ద అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. కాకాని రోడ్డు గడ్డిపాడులోని మున్సిపల్ స్కూల్ వద్ద ఉన్న పోలింగ్ బూతులో పురుషులు, మహిళలు గుంపులు, గుంపులుగా రావడంతో బూతు వద్ద తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు చోద్యం చూశారు. దీంతో మహిళ ఓటర్లు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కవ్వింపు చర్యలకు పాల్పడిన టీడీపీ శ్రేణులు..

తూర్పు నియోజకవర్గ పరిధిలోని లాలాపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా వచ్చారు. అయితే అక్కడికి చేరుకున్న టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడి తోపులాట చేసే ప్రయత్నం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎంతకు వినకపోవడంతో ఇరు వర్గాలపై పోలీసులు లాఠీఛార్జి చేసి చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

రాత్రి వరకు క్యూలైన్‌లో ఓటర్లు

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు ఎండను లెక్క చేయకుండా క్యూ లైనులో నిలబడ్డారు. సాయంత్రం 6 గంటలలోపు క్యూలైన్‌లో ఉన్న వారికి పోలింగ్ అధికారులు ప్రత్యేకంగా స్లిప్పులు జారీ చేశారు. 6 గంటలలోపు క్యూలైన్‌లో ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పిస్తామని అధికారులు చెప్పారు. 6 గంటలకు కూడా వందల సంఖ్యలో క్యూలైన్‌లో ఓటర్లు ఉన్నారు.

ప్రశాంతంగా పోలింగ్

- అత్యధిక సంఖ్యలో ఓటు వినియోగించుకున్న మహిళలు
- ఉదయం నుంచి రాత్రి వరకూ కొనసాగిన పోలింగ్

గుంటూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండలంలో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. అత్యధికంగా మహిళలు ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు.

మండలంలో ఏ బూత్‌లో చూసినా ఉదయం నుంచి సాయంత్రం వరకూ మహిళలు క్యూలైన్లలో బారులు తీరారు. పెద్ద సంఖ్యలో మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరటంతో టీడీపీ నాయకులు సైతం జగనన్న సంక్షేమ పథకాల రుణం తీర్చుకుంటున్నారని చర్చించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ జరుగుతూనే ఉంది. పోలింగ్ మొదటి దశలో ఒకటి రెండు చోట్ల మినహా ఈవీఎంలు అన్ని చోట్ల నిర్విరామంగా పనిచేశాయి. ఒకటి రెండు చోట్ల సుమారు అరగంట సమయం పాటు ఈవీఎంలు మొరాయించాయి. అనంతరం మరలా కొనసాగాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మండలంలో సుమారుగా 89 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన బలసాని

ఉదయం విజయవాడలో తన ఓటుహక్కును వినియోగించు కున్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసారి కిరణ్‌కుమార్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్దనున్న పోలింగ్ ఏజెంట్లను కలిసి పోలింగ్ సరళిని కనుక్కున్నారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఎటువంటి అసాంఘిక సంఘటలను జరగకుండా చూడాలని పోలీసులను కోరారు. పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన బలసానిని స్థానిక నాయకులు కలిసి పోలింగ్ సరళి తదితర విషయాలను వివరించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పోలింగ్ అధికారులను అడిగి ఎమ్మెల్యే అభ్యర్థి తెలుసుకున్నారు.

ఎన్ని'కల'ల చిత్రాలు


గుజ్జనగుండ్ల మహిళా పాలిటెక్నిక్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైనులో ఉన్న ఓటర్లు


ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధురాలు


బారులు తీరిన ముస్లిం ఓటర్లు


గుజ్జనగుండ్ల మహిళా పాలిటెక్నిక్ కళాశాల పోలింగ్ కేంద్రంలో క్యూలైనులో ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగులు




మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకుని సిరా చూపుతున్న యువత


చంటిబిడ్డతో ఓటు హక్కు వినియోగించుకున్న మహిళ


ఎస్వీఎన్ కాలనీ, చిన్మయ మిషన్ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైను నిలబడి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు


కేవీపీ కాలనీ మునిసిపల్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైనులో ఓటర్లు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. గుంటూరు నగరంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలివచ్చారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. అప్పటికే ఓటర్లు బారులుతీరారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువతీయువకులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహంగా తరలివచ్చారు. వృద్ధులు, వికలాంగులు వినియోగించుకున్నారు. అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

పోలింగ్ ఏజెంట్ల మధ్య రగడ

- ఇరు వర్గాల తోపులాట
- పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన గొడవ


తోసుకుంటున్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు

కొరిటెపాడు(గుంటూరు): చుట్టుగుంటలోని గుంటూరు మార్కెట్ కమిటీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నెంబరు-227లో ఇరుపార్టీల ఏజెంట్ల మధ్య చిన్నపాటి గొడవ రాజుకుంది. చివరకు చిలికి చిలికి గాలివానలా పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట, పిడిగుద్దుల వరకూ వెళ్లింది. ఒక పార్టీకి చెందిన ఏజెంట్ బూత్ బయటకు వచ్చి మంచినీరు కావాలని అడుగగా అదే పార్టీకి చెందిన కార్యకర్త పోలింగ్ బూత్ ఆవరణలోకి వెళ్లారు. దీంతో మరో పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో తోపులాటకు దిగారు. స్థానికంగా ఉన్న పోలీసులు పై అధికారులకు సమాచారం ఇవ్వడంతో నగరంపాలెం సీఐతో పాటు పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

కోబాల్డ్‌పేట బూత్‌లో బీఎల్ఓ అత్యుత్సాహం

నగరంపాలెం: 34వ డివిజన్ కోబాల్డ్‌పేట రెండో వీధిలోని మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ లూథరన్ ప్రైమరీ పాఠశాల పోలింగ్ కేంద్రంలోని ఓ బీఎల్ఓ అత్యుత్సాహం ప్రదర్శించింది. దీంతో ఓటర్లకు ఇబ్బందులు తప్పలేదు. ఈ కేంద్రంలో ఓట్లు వేసేందుకు కోబాల్డుపేట పరిసర ప్రాంతాల్లోని ఓటర్లు పోలింగ్ ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి పెద్దఎత్తున్న తరలివచ్చారు. అయితే ఓ బీఎల్ఓ అత్యుత్సాహంతో ఓట్లు వేసేందుకు వచ్చిన వారిని ముప్పతిప్పలకు గురిచేశారు. ఓటు వేసేందుకు తీసుకొచ్చిన గుర్తింపు కార్డులు అది, ఇది కాదంటూ ఇబ్బందికి గురిచేశారు. దీంతో గుర్తింపు కార్డుల కోసం ఓటర్లు ఇంటి వైపు పరుగు తీశారు. ఆఖరికి ఓ యువ ఓటరు ఓటు వేసేందుకు రాగా, ఓటు వేసేందుకు అర్హతలేదంటూ సదరు బీఎల్ఓ హుకుం జారీ చేసింది. దీంతో ఓటరు దగ్గర్లోని ఇంటికెళ్లి, విద్యార్హత ధ్రువీకరణ పత్రంతో తీసుకురాగా, అప్పుడు ఓటు వేసేందుకు అనుమతించడం విశేషం. సాయంత్రం వేళ గడువు ముగిసే కొద్ది ఓటర్లు బారులు తీరారు. సమయం గడిచే కొద్ది బూత్ సిబ్బంది అలస్యం చేయడంపై ఓటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఈలోగా ఎన్నికల అధికారులు, పశ్చిమ డీఎస్పీ మహేష్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొద్దిసేపటి తర్వాత వివాదం కాస్త సద్దుమణిగింది.

వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ నాయకుల దాడి



గుంటూరు ఈస్ట్: పచ్చచొక్కాల టీడీపీ నాయకులు బరితెగించారు. దొంగ ఓట్లు వేయడాన్ని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకుడిపై దాడి చేశారు. ఎన్నికల్లో తమ అరాచకాలను అడ్డుకున్నవారి ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడలేదు. వివరాలు.. సంగడిగుంట చలమయ్య విద్యా సంస్థల ప్రాంగణంలో టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేయిస్తున్నారన్న సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ 14వ వార్డు అధ్యక్షుడు గుదె నాగేశ్వరరావు తన అనుచరులతో వెళ్లి అడ్డుకున్నాడు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు నాగేశ్వరరావు, అతని అనుచరులపై దాడిచేశారు. దాడిలో నాగేశ్వరరావు తలకు తీవ్రగాయమైంది. బాధిత నాగేశ్వరరావు పార్టీ నాయకుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నిచికేత్ షలేకే సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చాడు. అక్కడున్న వారికి సర్దిచెప్పారు. ఇంతలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చలమయ్య చలమయ్య ప్రాంగణం వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను సర్దిచెప్పి పంపివేశారు. నాగేశ్వరరావును అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. లాలాపేట పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణప్రసాద్, రథినీచౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం ప్రకటించిన సీబీఎస్ఈ-2024 టెన్త్, 12వ తరగతి ఫలితాల్లో డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో విద్యార్థుల అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో సైన్స్ గ్రూపు ఎంపీసీ గ్రూపు నుంచి 500 మార్కులకు పెరుమాల నాగశ్రీ 488 మార్కులు సాధించినట్లు వివరించారు. ఎంబైపీసీ నుంచి శ్రీనివాసన్ సహాన 464, ఆర్ట్స్ గ్రూపులో హెచ్‌పీజీ నుంచి గరికపాటి పావని 443, బంకా ఆకాశ్ 431 మార్కులు సాధించినట్లు వివరించారు. అన్ని సబ్జెక్టులలోను అత్యధిక మార్కులు నమోదైనట్లు తెలిపారు. అదే విధంగా టెన్త్ ఫలితాల్లో 500 మార్కులకు అలుగుల శెట్టి రాజహంసిని 486, షేక్ సుమయా సల్మా 475 మార్కులు సాధించినట్లు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవ పున్నయ్య అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. రథినీ చౌదరి పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన సార్వత్రిక పోలింగ్ ప్రక్రియ


మేడికొండూరులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడిచేస్తున్న టీడీపీ శ్రేణులు


టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

మేడికొండూరు : సార్వత్రిక ఎన్నికలు మండలంలో ఉత్కంఠ పరిస్థితుల్లో సోమవారం ముగిశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలోని 14 గ్రామాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వైపు వడివడిగా అడుగులు వేశారు.

టీడీపీ వర్గీయుల దాడులు

మండల కేంద్రమైన మేడికొండూరులో 46, 47, 48 పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఓటర్లను సైకిల్ గుర్తుకు వేయాలంటూ ప్రచారం చేశారు. గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నించడంతో దాడులకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలపై కర్రలతో టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. కొర్రపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 168 పోలింగ్ స్టేషన్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వృద్ధులను ఓటు వేసేందుకు తీసుకొస్తున్న సమయంలో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రసన్న, చెన్నయ్య, అనిల్, విజయ్ గాయపడ్డారు. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. జంగంగుంట్లపాలెం, పొట్టపాడు 168 పోలింగ్‌బూత్‌లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు వాదనకు దిగారు. ఈ నేపథ్యంలో అధికారులు కొంత సమయం పోలింగ్ నిలిపివేశారు. నిబంధనలు అతిక్రమించి అల్లర్లకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు.

అంకిరెడ్డిపాలెంలో టీడీపీ రౌడీమూకల దాడి

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్‌ను కొందరు రౌడీ మూకలు అలజడి సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూశారు. దీంతో వెంటనే స్పందించిన ప్రజలు వారికి దేహశుద్ధి చేశారు. గుంటూరు, వెంగళాయపాలెం గ్రామాలకు చెందిన కొందరు రౌడీ మూకలు పూటుగా మద్యం సేవించి అంకిరెడ్డిపాలెంలో జరుగుతున్న పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చారు. మద్యం మత్తులో పోలింగ్ కేంద్రం సమీపంలోని ఖాళీస్థలాల్లోగల గడ్డి చెత్తకు నిప్పంటించారు. దీంతో గాలికి నిప్పు చెలరేగి చుట్టుపక్కల ఇళ్లపైకి వచ్చింది. సమీపంలోని చిల్లరకొట్టుకు సైతం అంటుకుంది. నిప్పంటించి జై పెమ్మసాని అంటూ ఆకతాయిలు పోలింగ్ కేంద్రంలోకి జొరబడపోతుండటంతో స్థానికులు సుమారు ఆకతాయిలను అడ్డుకున్నారు.